03022025-MAI-04_Layout 1 2/3/2025 2:37 AM Page 1



# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



## మన చదువులో తెలుగు వెలిగేదెలా

**ఇదివరకటి తరాలతో పోలిస్తే ఈ తరంలో సాహిత్యం పట్ల ఆసక్తి కాస్త తక్కువే. కాలంతో పాటు మార్పు వస్తుంది, అంగీకరించక తప్పదు. ఈ మార్పులకు అనుగుణంగా సాహిత్యాన్ని తర్వాతి తరాలకు అందించడంలో మన కర్తవ్యం ఏమిటనేదే పునరాలోచించుకోవాలి.**

**పాఠకులను తయారుచేసుకోవడంలో రెండు, మూడు తరాలను కోల్పోయాం. 10వ తరగతి లోపు 2000 రోజులు పాఠశాలలో గడిపిన పిల్లల్లో 2, 3 శాతానికి కూడా సాహిత్యం పట్ల ఆసక్తి కలగడం లేదు. సాహిత్యాన్ని వ్యక్తిగత ఇష్టంతో చదవడం లేదు. ఎక్కువ మంది ఉపాధ్యాయులు పిల్లలకు సాహిత్యాన్ని చేరవేయడంలో విజయం సాధించలేదు. సిలబస్ పూర్తిచేసే పనిలో మాత్రమే వాళ్లున్నారు. అందువల్ల పాఠశాల స్థాయిలోనే చాలావరకు సాహిత్యం పట్ల ఆసక్తి లేకుండా పోతున్నది. ప్రైవేట్ పాఠశాలల సంగతి చెప్పవలసిన అవసరం లేదు. తెలుగంటే వాళ్లకి అంటరానిది. మరి ఇంగ్లీషులో ఏమైనా సాహిత్య విలువలు ఉన్నాయా అంటే అది కూడా సున్నా. ఇంగ్లీషులో నాలుగు సృజనాత్మక వాక్యాలు రాయమన్నా వారు నోరు వెళ్లబెట్టాల్సిందే.**

ఇంటర్మీడియట్ స్థాయిలో కూడా పిల్లలకు సాహిత్యపు విలువలను, ఆసక్తిని కలిగించడంలో పూర్తిగా విఫలమైనట్టుగా తెలుస్తున్నది. ఇక డిగ్రీ స్థాయికి వచ్చేసరికి విద్యార్థులకు సమాజం పట్ల, సమూహం పట్ల ఒక అవగాహన ఏర్పడి ఉంటుంది. అక్కడ కూడా తెలుగు పాఠం మాత్రమే చెప్తున్నారు కానీ, సాహిత్యం ఏం చేస్తుందో, సాహిత్యంతో పాటు మనం ఎందుకు నడవాలో, మంచి పుస్తకాలు మనుషులను ఏం చేస్తాయో ఇట్లాంటి విషయాలను చేరవేయడంలో మన విద్యావిధానం సరైన మార్గంలో వెళ్లడం లేదని చెప్పవచ్చు.

ఇట్లాంటి సందర్భంలో సాహిత్యాన్ని యువత వద్దకు లేదా పాఠశాల స్థాయికి తీసుకువెళ్లాలంటే రచయితలుగా మనం ఏం చేయాలో ఆలోచించుకోవాలి. ఇప్పటికే అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో మనం ఉన్నాం. తెలుగు భాషకు సంబంధించి రాత విషయంలో పిల్లలు దారుణంగా వెనుకబడి ఉన్నారు. సొంతంగా పది వాక్యాలు కూడా రాయలేని తరం ఒకటి ఇప్పుడు నడుస్తున్నది. హైస్కూల్ స్థాయి పిల్లలకు అమ్మ గొప్పతనం గురించి, నాన్న గురించి పది వాక్యాలు రాయమని చూడండి, వాళ్లు ఎట్లాంటి స్థాయిలో ఉన్నారో అర్థమవుతుంది. ఉపన్యాస పోటీలు నిర్వహించండి కనీసం ముగ్గురు, నలుగురు వచ్చి నిలబడి మాట్లాడే పరిస్థితుల్లో ఉండరు. విద్యార్థుల ముందు నిలబడి పాఠం చెప్పే ఉపాధ్యాయులను రచయితలు చేరాలి. మండల కేంద్రాల్లోనూ, జిల్లా కేంద్రాల్లోనూ బతిమిలాడో, బలవంతంగానో అప్పుడప్పుడు సాహిత్య సమావేశాలు జరిపి ఉపాధ్యాయులను ఆహ్వానించి సాహిత్యాన్ని పిల్లలకు చేరవేయాలని చెప్పక తప్పదు. మా ఆదివారాన్ని నాశనం చేస్తారా అని ఉపాధ్యాయులు అడగవచ్చు.

నెలలో ఒక్క ఆదివారం మన కోసం, మన భాష కోసం, మన పిల్లల కోసం అని చెప్పి ఒప్పించగలగాలి. వీలైతే అందులో 10 శాతం ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లిన తర్వాత పిల్లల ముందు కచ్చితంగా ప్రయత్నం చేస్తారు. అలాగే జూనియర్, డిగ్రీ కళాశాలలు. ఇట్లా ముందు అధ్యాపకులను మనం చేరగలిగితే ఏమైనా మార్పు వస్తుందేమో చూడాలి. సాహిత్యం అంటే తెలుగు ఉపాధ్యాయుడి పని అనే అపోహను తొలగించగలగాలి. మనకు దగ్గరలో ఉన్న పాఠశాలలను, గురుకుల పాఠశాలలను, కస్తూర్బా పాఠశాలలను బృందాలుగా దర్శించాలి. అప్పుడప్పుడు చిన్న చిన్న వర్క్ షాపులు నిర్వహించుకోవాలి. ఇట్లాంటి కార్యాచరణను రూపొందించుకోవడానికి ముందు రచయితలు అంతా ఏకం కావాలి. మనం ఏ దృక్పథానికి చెందిన రచయిత అయినా పర్లేదు, ముందు సాహిత్యం పట్ల ఆసక్తిని, దాని విలువను తెలియజేయాల్సిన అవసరం ఉన్నది.

ఇప్పుడు మన ముందున్న కర్తవ్యం, సాహిత్యాన్ని తర్వాతి తరానికి అందించడమని నమ్మేవాళ్లు ఏకం కావాలి. రచయితలంతా ఏకమై తరచుగా విద్యాలయాలను సందర్శించడం, కనీసం బతిమాలైనా ఒక గంట పాటు అరువు తీసుకోవడం, ఆ గంటను చైతన్యవంతంగా, సమర్థవంతంగా వినియోగించుకోవడం పట్ల ఆలోచించాలి. ఉపాధ్యాయులను బృందాలుగా కలుసుకొని సాహిత్యాన్ని ఒక ఐదు నిమిషాలు పాఠశాలలో పరిచయం చేయమని బతిమిలాడాలి. వర్సిటీల్లో పీజీ స్థాయి విద్యార్థులుంటారు. వాళ్లకు కనీసం నెలకు ఒక సాహిత్య కార్యక్రమాన్ని ఏర్పాటుచేయాలి. ఇతిహాసాల నుంచి సమకాలీన సాహిత్యం వరకు ఏదో ఒక అంశాన్ని ఇచ్చి వాళ్ల చేత రెండు మూడు నిమిషాలు మాట్లాడించవచ్చు. ఆ నెపంతో వాళ్లు కొన్ని పుస్తకాలను తిరగేస్తారు. విశ్వవిద్యాలయ గ్రంథాలయాలను సందర్శిస్తారు. అక్కడే ఉండే పీజీ విద్యార్థులు, పరిశోధకులతో చిన్న వర్క్‌షాప్ సెమినార్లు ఏర్పాటు చేయవచ్చు. అయితే విశ్వవిద్యాలయంలో కూడా సమస్యలు లేకపోలేదు. అన్ని విశ్వవిద్యాలయాలలోను నియామకాలు లేవు. ఆయా విభాగాలలోని అధ్యాపకులకు కూడా హెచ్చు తగ్గు భేదాలు, ఒకరంటే ఒకరికి పడకపోవడాలు లాంటివి ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ సాహిత్యాన్ని యువత దగ్గరికి తీసుకెళ్లడంలో మనం సరైన మార్గం లో వెళ్లకపోవడం కారణంగా సాహిత్యంలో సృజనాత్మకతతో కూడిన ఆలోచనలు తక్కువ అయ్యా యి. పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ముందు తరం రచయితలు ఈతరం రచయితలతో ముఖాముఖి ఏర్పాటు చేయవచ్చు. కవిత్వ భాషా పుస్తకంలో బొల్లోజు బాబా చెప్పినట్టు సాహిత్యం చేసే పని చదివితే వచ్చే మార్కుల్లాగా కనిపించదు. అందులో ప్రోగ్రెస్ కార్డులు ఉండవు. కానీ సాహిత్యం అంతః సంస్కారం అనే విషయం కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలోత్సవ పేరు మీద ఒకటి రెండు రోజులు కార్యశాలలు జరుగుతున్నప్పటికీ అవి ఎంత మాత్రం కొనసాగింపుగా ఉన్నాయో పరిశీలించుకోవాలి. ప్రైవేటు పాఠశాలల్లో , ప్రభుత్వ పాఠశాలల్లో భాషోపాధ్యాయుడు, విద్యార్థులతో సారస్వత సంఘాలు ఏర్పాటు చేయాలి. చెట్టు, వర్షం, సముద్రం, ఆకాశం, మంచి స్నేహితుడు ఇట్లాంటి చిన్న చిన్న అంశాలు ఇచ్చి విద్యార్థుల చేత మాట్లాడించాలి. అక్కడ కొంతమంది కవుల రచనలను చదివి వినిపించగలగాలి. పాఠశాల స్థాయి సాహిత్యపు రుచిని నుంచి చూపించాలి.

తెలుగు సాహిత్యం చదువుకున్న వాళ్లకు ఓటీటీ వేదికలుగా అపారమైన అవకాశాలున్నాయి. మీడియాలో అవకాశాలున్నాయి. అయితే వాళ్లు కనీసం నాలుగైదు పేజీలు వ్యాసం రాయగలగాలి. అనువాదాల మీద దృష్టి పెట్టాలి. సృజనాత్మకత గల రచనకు ప్రాతిపదికగా అంతకుముందున్న రచనలు పనికొస్తాయనే విషయాన్ని తెలియజేయాలి. తెలుగు సాహిత్యాన్ని చదివితే ఎట్లాంటి అవకాశాలున్నాయో వాళ్లకు తెలియజేయాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఒక కథ చెప్పి తరగతి గదిలో చర్చలు మొదలుపెట్టవచ్చు. ఒక కవిత వినిపించి దాన్ని వారికెలా అర్థమైందో చెప్పమని అడగవచ్చు. తెలిసిన దాన్నుంచి పిల్లలను తెలియనిదానికి తీసుకువెళ్లి వదలాలి. ఇవాళ అన్ని స్థాయిల్లోనూ ఒక నిర్లిప్తత కొనసాగుతున్నది. మార్కులు సంపాదించే విషయం భాష కాదు. పాఠ్య పుస్తకాల్లోని పాఠాలతో భాషను నేర్పించలేం. అది కేవలం కొంత తోడ్పాటు మాత్రమే. ■



**డాక్టర్ సుంకర గోపాల్**



## బగ్గ చలి

దవ దవ చలి వెంటాడుతంది
ఇగం ఎక్కిన దేహమంతా విల విల
జమిలిగా రగ్గులు కప్పుకున్నా గజ గజ
మెలకువలోనే, అయినా లెవ్వాలనిపించదు
లోలోపల వణుకు ప్రకంపనలు

ఏదీ తెల్లారిందా! వెలుతురు చూద్దామని
కిటికీ తెర జర పక్కకు జరిపితే
అద్దమంతా మంచు పరచుకొన్న పదన
అవతలి వైపంతా మసక మసక కాంతి

కరెంటు పోలు పక్కన కుక్క నక్కింది
డాబా మెట్ల మీద పిల్లి కూన ముడుచుకుంది
గోడ మీద తోక తెగిన బల్లి తిరుగుతుంది
చల్ల గాలికి ఆ చూపులన్నీ బెదురు బెదురు

బయట అంతా కరకర ఈదర గాలి
చేసుకుంటేనే చెయ్యి నోట్లోకి వచ్చే స్థితిగతులు
ఎవరి దినచర్యల్లో వారు సంలీనం
ఇండ్లల్ల పనులు చేసే అతివలు
తలమాలలు కట్టి సర్రన ఉరుకుతనే ఉన్నరు
పాల పాకెట్లాయన నెత్తికి రుమాలు సుట్టుకొని
సైకిల్ మీద ఇల్లిల్లూ తిరుగుతనే ఉన్నడు
పేపరు పిల్లగాడు వణుక్కుంట వణుక్కుంట
ఇంటింటికీ వార్తలు ఇసిరికొడుతండు
పుర సేవికలకైతే చలీ వానా లేనే లేదు
పట్టణ పరిశుభ్రతకు బ్రాండ్ అంబాసిడర్లు

గడియారం ముల్లుకు కట్టుకున్న జీవితాలు
గడియ రికాం కావాలన్నా దొరకని సమయం
ఎండా వానా చలి ఏ విపత్తు అయినా ఒక్కతీరే

పొద్దు పొడిచి బారెడు ఎక్కిన శక తగిలింది
చలి పులి మెల్లమెల్లగా తోక ముడుస్తుంది.



**అన్నవరం దేవేందర్**
94407 63479



## అంతరంగం

హృదయాన్ని ఎన్ని సార్లు ప్రశ్నించినా
సమాధానం వచ్చినట్టే వచ్చి ఆవిరైపోతుంది.
నీటిలో చంద్రుడు కనిపిస్తే పట్టుకుందామని
ప్రయత్నిస్తే అలలన్నీ చెల్లాచెదురై చెరిపేస్తున్నాయి.
ఎదలో నాలుగు గదులనిండా అంతరంగం మాత్రం
గట్టి సంకల్పంతో ముందుకుపొమ్మంటున్నది.

అర్ధరాత్రి చీకట్లు కమ్ముకొన్న
వేల కళ్లల్లో మాత్రం
వెలుగు జిలుగులు మెరుస్తున్నాయి.
దారిపొడవునా కానరాని గమ్యాన్ని
గుండె నిండ వున్న ధైర్యం
రెండు కన్నులై చూపిస్తుంది.
బాధల బరువుల్లో చిక్కుకొని
తనువంతా గాయపడి తడబడుతున్న జీవితం
స్వప్నాలన్నీ జాతరలై వస్తున్నాయి.
కానీ, నిజమైన బతుకుజాతర రసరమ్యంగా
సాగుతుంది.

ప్రతిరోజు ఒక కొత్త చరిత్రను
రాసేలా గడుస్తుంది
ప్రయత్నానికి విసుగొచ్చేలా..
కండలన్నీ కరిగిపోయి
చెమట చుక్కల వర్షం కురుస్తుంది.
యుద్ధంలో ఎక్కడా విరామం లేదు.
మనిషివై పుట్టాక విజయం రుచిని చూడకుండా
ఎలా వుంటావ్ అని అనంతరం
అడుగుతూనే ఉంది.
సమాధానం గొంతుదాటని జవాబై చూస్తుంది.

నేడు కాకపోతే రేపు.. ఇక్కడే ఉంటాను
విజయతీరాన్ని ముద్దాడి వస్తాను.
కాలానికి సవాల్ విసురుతూనే వున్నాను
మాయ మనుషులు ఉచ్వాస నిశ్వాసలను
బంధించినా.. కాలం కసితో కాటేసినా..
గతాన్ని కష్టమనే మందుతో కడిగేసి సాగిపోతాను.
గెలుపు కిటికీలు తెరిచేవరకు




**అశోక్ గోనె**
94413 17361

## సాహితీ వటవృక్షం

**విశ్వనాథ సత్యనారాయణ లాంటి ఒక మహాకవి, తాను రచించిన 'భక్తి యోగ' కావ్య సంపుటిని ఒక వ్యక్తికి అంకితం ఇచ్చారంటే, అంకితం పొందిన ఆ వ్యక్తి విశిష్టత ఏమిటో ద్యోతకమవుతుంది.**

**విశ్వనాథ గుర్తింపు, ఆశీస్సులు పొందిన ఆ వ్యక్తి మరెవ్వరో కాదు.. ఆ రోజుల్లో కరీంనగర్ పట్టణంలో సాహితీ నందనోద్యానవనాన్ని సృష్టించి, కవితా గోష్టుల ద్వారా దాని ఎదుగుదలకు నిరంతరం శ్రమించిన కృషీవలుడు, న్యాయవాది జువ్వాడి గౌతమ రావు.**



'భక్తి యోగ' అంకితం సందర్భంగా జువ్వాడి గౌతమ రావు గురించి విశ్వనాథ అభిప్రాయం ఆయన పద్యాల రూపంలో...

> **నిజమునకు భావుకుండని**
> **సృజనన్ పదివేలమంది నెవ్వడొ యొక్కండు జనించు, మెఱయు వానికి**
> **రజనీపతి కాంతి బ్రౌ భరమ్ముపుడపుడ**
>
> **వారిలో నొక్కరుండు జువ్వాడి వంశ**
> **రజనికాంతుండు గౌతమరావనంగ**
> **కవికి నట్టిడు నొక చెలికాడు దొరకు**
> **తొలుతటి జనస్సులందలి చెలిమికాడు**

కరీంనగర్ పట్టణానికి అతి సమీపంలోని ఇరుకుల్ల గ్రామంలో 1929, ఫిబ్రవరి 1న జన్మించాడు గౌతమ రావు. హైస్కూల్ వరకు విద్యాభ్యాసం కరీంనగర్‌లో సాగినా, ఆ పై చదువులు భాగ్యనగరంలో కొనసాగి ఓయూ నుంచి బీకాం, ఎల్ఎల్‌బీ పట్టాలను పొందారు. ఆ తర్వాత కరీంనగర్ పట్టణంలో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయినప్పటికీ, ప్రవృత్తిరీత్యా గౌతమరావు సాహిత్యాభిమాని. స్వతహాగా కవి. అయితే ఆయన ప్రతిభ, న్యాయవాద వృత్తికి, సాహిత్య సేవకు మాత్రమే పరిమితం కాలేదు. వీటితో పాటుగా పత్రికా సంపాదకుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయన రాణించారు.

> **హైస్కూల్‌లో చదివేరోజుల్లో జువ్వాడికి విశ్వనాథ నవలలు చదివే అవకాశం లభించింది. దాంతో ఆయనకు విశ్వనాథ అంటే అభిమానం, గురుభావం ఏర్పడ్డాయి. ఆ తర్వాత 1953లో జువ్వాడి విజయవాడకు వెళ్లి విశ్వనాథ దర్శనం చేసుకొని పరిచయం పెంచుకున్నారు. దీనితో ఆయనకు విశ్వనాథ రచిస్తున్న 'రామాయణ కల్పవృక్ష' పద్యాలను చదివే అవకాశం లభించింది.**


జువ్వాడికి విశ్వనాథ అంటే ఎనలేని భక్తి భావన, అందువల్ల రామాయణ కల్పవృక్ష పద్యాలను సాహిత్య సభల్లో జనరంజకంగా చదువుతూ వాటిలోని అంతరార్థాన్ని విపులంగా వివరించేవారు. విశ్వనాథ 1959లో విజయవాడలో పదవీ విరమణ చేశారు. ఇక కరీంనగర్‌లో ఇప్పుడు ప్రభుత్వ కళాశాలగా ఉన్న ఎస్సారార్ కళాశాల అప్పట్లో ఒక ప్రైవేట్ కాలేజీగా ఉండేది. ఆ కళాశాలకు విశ్వనాథను ప్రిన్సిపల్‌గా తీసుకొని రావడంలో విశేష కృషిచేసి కృతకృత్యుడయ్యారు గౌతమ రావు. దీంతో విశ్వనాథ, జువ్వాడిల సాన్నిహిత్యం మరింత బలపడి కరీంనగర్ పట్టణ సాహిత్య దీప్తి నలువైపులా వెలుగులను వెదజల్లింది. విశ్వనాథ వాస్తవంగా పద్యకవి. అయినా ఆయన రామాయణ కల్పవృక్షం రాసే సమయంలో రోజుకు కొన్ని పద్యాలు మాత్రమే రాస్తూ ఉండే వారు. అందువల్ల కృష్ణా జిల్లాలో బాలకాడతో మొదలైన కల్పవృక్షం ముప్పై ఏండ్ల రచనగా కొనసాగి కరీంనగర్‌లో ఉన్న మూడేండ్లలో యుద్ధకాండతో ముగిసింది. విశ్వనాథ ఆశీస్సులందుకున్న జువ్వాడి సాహితీపరంగా, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, కాళోజీ నారాయణ రావు, కోవెల సుప్రసన్నాచార్య, సామల సదాశివ లాంటి ప్రముఖులతో సాహిత్య సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారు. ఇక ఆయన రాసిన పెక్కు వ్యాసాల్లో 'కల్ప వృక్షంలో కైకేయి', 'వేయి పడగలలో విశ్వనాథ జీవితం' విమర్శకుల నుంచి ప్రశంసలందుకున్నాయి. జువ్వాడి వ్యాసాలన్నింటిని వెలిచాల కొండలరావు సంకలనం చేసి 'సాహిత్యధార' పేరుతో ప్రకటించారు.

1926 ప్రాంతంలో విశ్వనాథ ఒక సాహితీ మాసపత్రిక 'జయంతి'ని ప్రారంభించారు. అయితే, ఆర్థిక కారణాల వల్ల ఆ పత్రిక ఎక్కువ కాలం కొనసాగలేదు. తర్వాత 1958లో విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వెంకటావధాని, కేతవరపు రామకోటి శాస్త్రి, జువ్వాడి గౌతమ రావు సంపాదకవర్గ సభ్యులుగా 'జయంతి' పత్రిక పునరుద్ధరించబడింది. సాహితీ దిగ్గజాలు సంపాదక వర్గంలో ఉన్నప్పటికీ దాని నిర్వహణా బాధ్యత అంతా జువ్వాడిదే. ఈ కొత్త బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారు జువ్వాడి. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి తొలి కవిత 'జయంతి'లో అచ్చవడం ఒక విశేషం.

ఇక ఆయన రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే, హైదరాబాద్ కాలేజీల్లో చదివే రోజుల్లో జయప్రకాశ్ నారాయణ్ ప్రభావానికి లోనయ్యారు. రామ్‌మనోహర్ లోహియా వంటి నాయకులతో సాన్నిహిత్యం ఏర్పడింది. వీటి ప్రభావంతో జువ్వాడి సోషలిస్టుగా మారాడు. ఆ రోజుల్లో నిజాం వ్యతిరేక పోరాటంతో హైదరాబాద్ స్టేట్ అట్టుడికిపోతున్నది. 1947, ఏప్రిల్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కాలేజీ భవనం మీద కాంగ్రెస్ జెండా ఎగిరింది. అది జువ్వాడి పనేనని భావించిన పోలీసులు 'అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిగా' కేసు పెట్టి రెండేండ్ల జైలు శిక్ష విధించారు. అయితే, ఔరంగబాద్ జైలు గోడలు మాత్రం ఆయనను నిర్బంధించలేకపోయాయి. రెండు నెలల్లోనే జైలు నుంచి తప్పించుకొని చాందాకు వెళ్లిపోయారు. చాందాలో స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వియ్యంకుడు కేవీ నరసింగరావు ఆధ్వర్యంలో నడుస్తున్న క్యాంప్‌లో మిలిటరీ శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత కరీంనగర్‌కు వంద మైళ్లు నడుచుకుంటూ వచ్చి మళ్లీ పోరాటం మొదలుపెట్టారు.

సమాజం కోసం ఎంతో పరిశ్రమించినా అప్పట్లో కాంగ్రెస్, కమ్యూనిస్టుల ప్రభావం వల్ల సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసిన జువ్వాడికి విజయం లభించలేదు. జీవితమంతా సాహిత్య సేవలో, ప్రజా పోరాటాల్లోనూ పాల్గొని, సహృదయుడిగా పేరుగాంచిన జువ్వాడి గౌతమ్ రావు 83 ఏండ్ల వయస్సులో 2012, ఆగస్టు 24 శుక్రవారం రోజున స్వర్గస్థులయ్యారు. కరీంనగర్ పట్టణ సాహితీ నందనోద్యానవనం తన తోటమాలి మరణంతో మౌనంగా రోదించింది.

**(ఫిబ్రవరి 1న జువ్వాడి గౌతమ రావు జయంతి సందర్భంగా..)**



**బసవరాజు నరేందర్‌రావు**
99085 16549

## సాహితీ పురస్కారాలు

**2025,** ఫిబ్రవరి 8వ తేదీ శనివారం రోజున ఉదయం 10 గంటలకు చిత్తూరులోని నాయుడు బిల్డింగ్స్, విజయం డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో 'గంటా కమలమ్మ సాహితీ పురస్కారం' ప్రదాన కార్యక్రమం జరుగనున్నది. 2024 కోసం నిర్వహించిన పోటీలో పురస్కారాలకు తెలంగాణ నుంచి నల్గొండ జిల్లాకు చెందిన తుల శ్రీనివాస్ రాసిన 'చింతల తొవ్వ', ఏపీ నుంచి శ్రీకాకుళం జిల్లాకు చెందిన సాంబమూర్తి లండ రాసిన 'నాలుగు రెక్కల పిట్ట' కవితా సంపుటాలు ఎంపికయ్యాయి. డాక్టర్ రాధేయ (అనంతపురం), డాక్టర్ రఘు (హైదరాబాద్) న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పురస్కార గ్రహీతలను రూ.10 వేల నగదుతో పాటు, జ్ఞాపికతో సత్కరించనున్నట్టు నిర్వాహకులు గంటా మోహన్, రాజా, రాజేంద్ర తెలిపారు.

### ఆహ్వానం

2025, ఫిబ్రవరి 8, 9వ తేదీలలో సిద్దిపేటలోని విపంచి కళా నిలయంలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 16వ వార్షిక సదస్సు జరుగనున్నది. అంబేద్కర్ ప్రభావంతో తెలుగు సాహిత్య విమర్శను అభివృద్ధి చేసిన బోయి విజయభారతి స్మారకోపన్యాసం, అంబేద్కర్ ఆలోచనల స్ఫూర్తి కవి సమ్మేళనం జరుగనున్నది. ఈ సదస్సుకు సాహిత్యకారులు అధిక సంఖ్యలో హాజరై సభలను విజయవంతం చేయాలని కోరుతున్నాం.


**- ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక**

## గాయం


నిన్న నయ్యం ఇవాళ గాయం
మానని గాయానికి మందు పెట్టడానికి
రేపటి రోజు మేలు

మందు పెట్టినాక మానిపోతుంది
మాయమవుతుంది
గతమయి జ్ఞాపకము ఉంటుంది
వర్తమానమై వర్ధిల్లుతుంది

పుండు మానిన బెందు పోదుగా
మందు పెట్టిన యాల మరిచిపోము
మనిషికి మరో తోవ సూపినోడు
బతుకును బాగా చేసినోడు చేసేటోడు
మరువముగా...



**దేవరపాగ కృష్ణయ్య**
9963449579



**తెలుగు భాష ప్రాచీన సాహిత్య ప్రక్రియల్లో 'శతక ప్రక్రియ' చెప్పుకోదగినది. ఈ ప్రక్రియలో ఎంతోమంది కవులు ఇప్పటికే ఎన్నోరకాల రచనలు చేశారు. అందుకే, పద్య ప్రక్రియ నిత్య నూతనంగా ఇప్పటికీ వెలుగొందుతూనే ఉన్నది. పద్యం రాయడానికి ఛందో పరిజ్ఞానంతో పాటు భాషపై పట్టు కూడా ఉండాలి. అలాంటి పట్టును భాషపై సాధించి చక్కని పద్యరచన చేస్తున్నారు కవి తిప్పారపు లక్ష్మీ నర్సయాచార్యులు. ఇతని పద్యాలలో పదకూర్పు, భావ సౌందర్యం మనోరంజకంగా ఉంటుంది. అంతే కాదు, కవి తిప్పారపు పలు సాహిత్య సమూహాల్లో తమ సాహిత్య సేవలను అందిస్తున్నారు. తిప్పారపు రాస్తున్న పద్యాలు వర్తమాన కవులకు ఆదర్శంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.**

## ముక్తి సాధనం..

కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన తిప్పారపు లక్ష్మీ నర్సయాచార్యులు ఇప్పటికే 'వేంకటరమణ', 'లలితాస్తుతి' శతకాలను వెలువరించారు. ఇప్పుడు 'కృష్ణా! శతకం'ను సాహితీ లోకానికి పరిచయం చేశారు. రచయిత విష్ణు సహస్ర నామ పారాయణం చేసి అమూలాగ్రం ఒంటబట్టించుకొని దానిలోని విష్ణు పరమైన శబ్దాలను గ్రహించి తన పద్య భావాలలో కూర్చారు. 'కృష్ణా!' అనే సంబోధనతో చక్కని శతకాన్ని కంద పద్యాలతో కూర్చారు. మచ్చుకు ఒక పద్యాన్ని గురించి ఇక్కడ ప్రస్తావించుకుందాం.

> లోకాధ్యక్షుడవీనే
> సాకారా శాశ్వతాయ సన్నుత రూపా
> నైకాత్మ శిపివిష్టా
> శ్రీకాంతా దండమయ్య శ్రీమత కృష్ణా!!

'కృష్ణా నీవు లోకాలను చూసేవాడివి. పలురూపాల్లో వెలిగేవాడివి. ప్రసన్నవదనం కలవాడివైన నీకు మొక్కుతున్నాను' అంటూ తన భక్తి విశ్వాసంలో ప్రకటించారు. పద్య కవిత్వంలో కవి తిప్పారపు లక్ష్మీ నర్సయాచార్యులు ఆరితేరినవాడు కాబట్టే ఈ శతకాన్ని అవలీలగా రాశారు. ఈ పుస్తకం చదివేవారు ఆ కృష్ణ భగవానుడి విశ్వరూపాన్ని సందర్శించుకుంటారు. ఇతరులకు ఉపకారం చేయాలని తపిస్తూ 'లోకాన్ని రక్షించు కృష్ణా!' అని రచయిత ఆ శ్రీకృష్ణ పరమాత్ముడిని వేడుకున్నారు. ఈ భక్తి శతకాన్ని అర్థవంతమైన భావ సమన్వయంతో కూర్చిన తీరు అద్వితీయం, అమోఘం, అనిర్వచనీయం. కృష్ణ తత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఈ శతకం నూటికి నూరుపాళ్లు ఉపయోగపడుతుంది.



**కందుకూరి భాస్కర్**
94415 57188



## రక్తాశ్రువు

అక్షరాల్లో ఎక్కడైనా
ఆవేశం కట్టలు తెంచుకున్నప్పుడు..
చూసి అనుభూతించడమే!
నిజంగానే ఎక్కడైనా
కనులు రక్తాశ్రువులను స్రవిస్తాయా?

***

నిశ్చల.. నిర్మల.. నిమేషాలయిన
నీ నయనాల కొలుకుల నుంచి
వీనుల వేపుగా సాగి ఆగింది...
ఆ రక్తాశ్రువు!

నీ వదనం కదలకుండా
చుబుకం పట్టుకుని..
చూపుడువేలితో తుడిచేశాను..
గులాబీ మేనితలం మీద ఎర్రటి మరకని!

***

దహించిన దుఃఖాల్ని
వెచ్చగా స్రవించడం..
ఎరిగిన కనులు కదా అవి!
పొంగిన ఆనందాల్ని
దాచుకోక వర్షించడం..
అలవాటైన కనులే కదా!
ఇపుడీ రక్తాశ్రువు.. ఏ సందేశాన్ని
సంకేతంగా ఇవ్వబోతున్నదో కదా?

***

దుఃఖానందాలను అనుభూతించని
పారమార్థిక స్థితికి చేరావు నువ్వు!


నీ కార్నియాలను కత్తిరించారు..
చల్లటి రక్తధారలు స్రవించగా..!

ఈ నిశీధి జగతిలో..
ఏవో రెండు చీకటి గుయ్యారాల్లో
చిరు దీపాలుగా మారి వెలుగుతాయి అవి!

***

నీ కంటి ధార అది..
నువు చూపే దారి అది..
మరక తుడిచినా మాయని ముద్ర అది!
ఆలోచన లేని లోచనాలకు..
రెక్కమాను మీద వెలిగే..
ఎర్రటి దిశా నిర్దేశం!
ఆ రక్తాశ్రువు!!

(అమ్మ నేత్రదానం చేసిన సందర్భపు చెమ్మ)



**కె.ఎ.ముని సురేష్ పిళ్లై**
99594 88088